# అయిదవ షెడ్యూలునూ ఆదివాసుల జీవితాల్నీ రక్షించుకుందాం రండి



ప్రజలారా!

రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలును సవరించడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఎదుర్కోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

అందులో మొదటిమెట్టుగా, ఆ ప్రయత్నాన్ని అడ్డుకొమ్మని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసే వినతిపత్రం పైన సంతకం చేయవలసిందిగా కోరుతున్నాం.

సవరణప్రయత్నం మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోనే మొదలయింది కాబట్టి దానిని అడ్డుకునే ప్రయత్నం కూడా మనమే మొదట చేపట్టడం ఉచితంగా ఉంటుంది.

అయిదవ షెడ్యూలులో ఏముంది? దానిని సవరించాలని చంద్రబాబు వంటివారు ఎందుకు ప్రయత్నిస్తున్నారు? మనమంతా ఆ ప్రయత్నాన్ని ఎందుకు వ్యతిరేకించాలి?

అయిదవ షెడ్యూలు ఆదివాసులు మెజారిటీగా ఉండే ఏజెన్సీ ప్రాంతాలకు వర్తించే విషయం. దేశంలో సాధారణంగా ఉనికిలో ఉన్న చట్టాలు ఉన్నవున్నట్టుగా ఆదివాసీ ప్రాంతాలకు వర్తింపచేసినట్టయితే ఆదివాసులకు నష్టం జరగగలదని మన రాజ్యాంగకర్తలు గుర్తించి అయిదవ షెడ్యూలును రూపొందించారు.

ఉదాహరణకు దేశంలో ఎవరైనా ఎక్కడైనా (డబ్బులుంటే) ఆస్తులు కొనుక్కోవచ్చు. ఎక్కడయినా వ్యాపారం చేసుకోవచ్చు అనేది సాధారణ చట్టం. అదొక ప్రాథమిక హక్కు కూడా.

కానీ ఆ హక్కు ఏజెన్సీ ప్రాంతాలలో కూడా యధేచ్ఛగా కల్పించినట్టయితే గిరిజనేతరులు అక్కడ ఆదివాసులకు మనుగడే లేకుండా చేయగలరు. అందువల్ల ఏజెన్సీలో ఆదివాసుల భూమిని ఇతరులు కొనుక్కోవడానికి వీలులేదని ఎల్‌టిఆర్ చట్టం అంటుంది.

ఇటువంటి చట్టాలు ఇతర విషయాలలో కూడా అవసరమవుతాయని రాజ్యాంగకర్తలు గుర్తించారు. ఏ చట్టాన్నయినా ఏ రూపంలో, ఏ మేరకు ఏజెన్సీ ప్రాంతాలకు వర్తింపజేయాలో ఆచితూచి నిర్ణయించి ఆ మేరకు దానిని సవరిస్తూ లేక తిరగరాస్తూ 'రెగ్యులేషన్' జారీ చేసే అధికారాన్ని రాజ్యాంగం రాష్ట్రగవర్నర్ చేతిలో పెట్టింది. అదే అయిదవ షెడ్యూలులోని ప్రధాన అంశం. ఏజెన్సీలో 'శాంతి, సత్పరిపాలన'లను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రగవర్నర్ ఈ అధికారాన్ని వినియోగించాలని అయిదవ షెడ్యూలు అంటుంది.

ఇప్పుడు దీనిని ఏవిధంగా సవరించాలని మన పాలకులు ప్రయత్నిస్తున్నారు?

ఇన్నాళ్లూ మనవాళ్లు ఏమనుకున్నారంటే, 'శాంతి, సత్పరిపాలన'ల కోసం గవర్నర్ గిరిజనేతరులకు అనుకూలమైన రెగ్యులేషన్‌లు కూడా జారీ చేయవచ్చునని. 'శాంతి', 'సత్పరిపాలన' అనేవి అందరికీ సంబంధించిన విషయాలుగా కనిపిస్తాయి కదా! తటస్థమైన మాటలుగా కనిపిస్తాయి కదా. గిరిజనేతరుల ప్రయోజనాలకు అనుకూలమైన రెగ్యులేషన్‌లు చేయడానికి అవి ఆటంకమెందుకు కావాలి? అనుకున్నారు.

కానీ 1997లో సుప్రీంకోర్టు 'సమత' కేసులో అయిదవ షెడ్యూలును వ్యాఖ్యానిస్తూ ఏమనిందంటే 'శాంతి, సత్పరిపాలన' అనేవి ఆదివాసుల సామాజిక ఆర్థిక ప్రయోజనాలకు సమానార్థకమైన మాటలని. అందువల్ల ఆదివాసుల ప్రయోజనాలకు వ్యతిరేకమైన రెగ్యులేషన్లేవీ గవర్నర్ అయిదవ షెడ్యూలు కింద జారీ చేయడానికి వీలులేదని ఆ తీర్పు రాసిన జస్టిస్ రామస్వామి అన్నారు.

ప్రత్యేకించి, ఏజెన్సీలో భూమిని ఏ రూపంలోనూ గిరిజనేతరులకు ప్రభుత్వం బదలాయించడానికి వీలులేదనీ ఆ నిషేధం అయిదవ షెడ్యూలులోనే ఉందనీ జస్టిస్ రామస్వామి అన్నారు.

ఇప్పుడు దీనినే సవరించాలని మన పాలకులు ప్రయత్నిస్తున్నారు. 'అభివృద్ధి' కోసం ఏజెన్సీలో భూమిని గిరిజనేతరులకు బదలాయించక తప్పదని వారి వాదన.

ఎందుకంట ?

ఈ గొడవంతా మన విశాఖపట్నం జిల్లా చింతపల్లితో మొదలయింది. అక్కడ బాక్సైట్ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయనీ వాటిని తవ్వి తీసి అల్యూమినియం తయారు చేసే లైసెన్స్ ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వబోతున్నామనీ చంద్రబాబు దాదాపు ఒక సంవత్సరం క్రితం ప్రకటించాడు. దానికి తన పార్టీకి చెందిన ఆదివాసీ ఎంఎల్ఏలను దబాయించి ఒప్పించాడు.

'వన్ ఆఫ్ సెవెంటీ' అని మామూలుగా పిలువబడే ఎల్‌టిఆర్ చట్టమొక్కటే దీనికి ఆటంకం అనుకున్నాడు. ఏజెన్సీలో 'ఎవ్వరూ' కూడా గిరిజనేతరులకు భూమిని ఏ రూపంలోనూ బదలాయించడానికి వీలులేదని ఆ చట్టం అంటుంది. 'ఎవ్వరూ' అనేది మనుషులకే తప్ప ప్రభుత్వానికి వర్తించదని మన ప్రభుత్వం భావించి విశాఖపట్నం ఏజెన్సీలో కొంతకాలం క్రితం బిర్లావాళ్లకు గనుల తవ్వకం కోసం భూమి లీజుకు ఇవ్వగా, సమత అనే స్వచ్ఛంద సంస్థ కోర్టుకెక్కింది. 'ఎవ్వరూ' అంటే ప్రభుత్వం కూడానని వాదించింది. మన హైకోర్టు ఒప్పుకోలేదుగానీ సుప్రీంకోర్టు ఒప్పుకునింది. ప్రభుత్వం ఏజెన్సీలో గిరిజనేతరులకు గనులు లీజుకివ్వడానికి వీలు లేదనింది. ఇది 'సమత' కేసులో జస్టిస్ రామస్వామి ఇచ్చిన తీర్పులోని ఒక అంశం.

> ఒక మంచిపని చేయడానికి వెయ్యి అబద్ధాలయినా ఆడవచ్చునని పెద్దలు చెప్పారంటారు. ఎవరు చెప్పినా చెప్పకున్నా అబద్ధాలు ఆడడానికి చంద్రబాబుకు అభ్యంతరమెన్నడూ లేదు కాబట్టి ఒక పెద్ద అబద్ధాన్ని పునాది చేసుకుని ఈ ప్రయత్నాన్ని సాగిస్తున్నాడు.

ఆ సంగతి మాత్రం తెలుసుకున్న చంద్రబాబు, ఎల్‌టిఆర్ చట్టాన్ని సవరించి 'ఎవ్వరూ' అనేది ప్రభుత్వానికి వర్తించదని మారిస్తే సరిపోతుందనుకున్నాడు. ఆ ప్రతిపాదనకు తన పార్టీ ఎంఎల్ఏలు మెజారిటీగా ఉన్న ఆదివాసీ సలహా మండలి చేత ఒప్పించాడు.

అయితే జస్టిస్ రామస్వామిగారి తీర్పులో రెండవ అంశం ఉందనీ, అది అయిదవ షెడ్యూలుకు ఆయన ఇచ్చిన వ్యాఖ్యానమనీ మాబోటివాళ్లము గుర్తు చేశాము. ఆ వ్యాఖ్యానం ప్రకారం ప్రభుత్వం గిరిజనేతరులకు ఏజెన్సీలో భూములు లీజుకు ఇవ్వడానికి వీలులేదన్న నిషేధం అయిదవ షెడ్యూలులోనే ఉంది.

ఈ సంగతి అర్థమయిన తరువాత చంద్రబాబు ఇప్పుడు అయిదవ షెడ్యూలు మీదనే పడ్డాడు. కేంద్రప్రభుత్వం దగ్గర తనకున్న పరపతిని వాడుకొని కేంద్రగనుల శాఖ చేత ఈ సవరణ ప్రతిపాదన పెట్టించాడు. ఒక మంచిపని చేయడానికి వెయ్యి అబద్ధాలయినా ఆడవచ్చునని పెద్దలు చెప్పారంటారు. ఎవరు చెప్పినా చెప్పకున్నా అబద్ధాలు ఆడడానికి చంద్రబాబుకు అభ్యంతరమెన్నడూ లేదు కాబట్టి ఒక పెద్ద అబద్ధాన్ని పునాది చేసుకుని ఈ ప్రయత్నాన్ని సాగిస్తున్నాడు.

దేశంలోని ఏజెన్సీ ప్రాంతాలలో రకరకాల ఖనిజాలున్నాయనీ, 'సమతా' తీర్పు ప్రకారం ఆ ఖనిజాలన్నీ వృధాగా ఉండిపోవలసివస్తుందనీ ఇంక దేశానికి అభివృద్ధి ఉండదనీ అంటున్నాడు.

ఇది అబద్ధం. 'సమతా' తీర్పు ప్రకారమైనా, ఎల్‌టిఆర్ చట్టం ప్రకారమైనా ఏజెన్సీలో ప్రైవేట్ కంపెనీల ప్రవేశం మాత్రమే నిషిద్ధం. ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీ సహకార సంఘాలు గనుల తవ్వకం చేపట్టవచ్చు. అప్పుడు ఆదివాసుల జీవితానికి, జీవనానికి జరగగల హానిని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా, పరిమితంగా తవ్వకం చేపట్టవచ్చు. అంతమేరకు అది ఆదివాసులకు ఉపాధి జీవనాధారం కల్పించేటట్టు చూడవచ్చు. ఆచరణ యోగ్యమైన ఈ ప్రత్యామ్నాయం అందుబాట్లో ఉండగా 'ఇంక ఖనిజాలన్నీ వృధాగా నేలలో ఉండిపోవలసిందేనని సుప్రీంకోర్టు అంటున్నది' అంటూ అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రైవేట్ కంపెనీలు లాభాలు పండించుకోవడం కోసం రాజ్యాంగాన్ని సవరించడానికి మన పాలకులు పూనుకుంటున్నారు. ఈ లాభాల వేట ఆదివాసుల జీవితాన్నీ జీవనాన్నీ ధ్వంసం చేయగలదు.

అందుకే దీనిని వ్యతిరేకించమని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

15.02.2001

మానవహక్కుల వేదిక (HRF)